



EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
08 మార్చి 2025
పేజీలు: 02



## ట్రెడిషనల్ లుక్‌లో ఫిదా చేస్తున్న వైష్ణవి

వైష్ణవి చైతన్య సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టీవ్‌గా ఉంటూ లేటెస్ట్ ఫొటో షూట్స్, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ ఫ్యాన్స్‌ను పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా వైష్ణవి చైతన్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో పింక్ కలర్ బ్లౌజ్ క్రీమ్ కలర్ శారీ కట్టుకుంది.అలాగే చిన్న ఇయర్ రింగ్స్, ఒక చేతికి బ్రాస్‌లేట్ మరో చేతి ఫింగర్‌కి రింగ్ పెట్టుకుంది. అలా చాలా సింపుల్ లుక్‌లో ఫొటోస్‌కి స్టిల్స్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు సో క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మీరు ఈ భామ పోస్ట్ పై ఓ లుక్ వేసేయండి.




## తెలుగులో సాలిడ్ ఓపెనింగ్స్ అందుకున్న ఛావా

లేటెస్ట్ బాలీవుడ్ సినిమా దగ్గర వచ్చి సూపర్ హిట్ అయ్యిన చిత్రాల్లో విలక్షణ నటుడు విక్కీ కౌశల్ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్ గా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన సాలిడ్ హిస్టారికల్ యాక్షన్ డ్రామా "ఛావా". అయితే ఈ సినిమా హిందీలో సంచలన ఓపెనింగ్స్ అందుకోగా అక్కడ రిలీజ్ అయ్యిన మొదటి రోజు నుంచే తెలుగులో సాలిడ్ డిమాండ్ నెలకొంది. ఇలా మొత్తానికి తెలుగులో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం అనూహ్య రెస్పాన్స్ ని అందుకోవడం విశేషం. డే 1 కి రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి బుకింగ్స్ ని ఈ చిత్రం నమోదు చేస్తున్నట్టుగా ఆల్రెడీ తెలిపాము. మరి ఈ స్వింగ్ కి తగ్గట్టుగానే తెలుగు వెర్షన్ లో 3 కోట్ల మేర గ్రాస్ ని అందుకున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. దీనితో ఛావా పట్ల తెలుగు ఆడియెన్స్ ఏ రేంజ్ లో ఎదురు చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇది ఖచ్చితంగా మన చరిత్ర, అందులోని శంభాజీ మహారాజ్ కే దక్కుతుంది అని చెప్పవచ్చు.

## పోసానిపై ఆగని వేధింపులు.. మరో పీఎస్‌కు తరలింపు

పోసాని కృష్ణ మురళిపై కూటమి సర్కార్ వేధింపులు ఆగడం లేదు. కూటమి పార్టీల నేతలు పెట్టిన కేసుల్లో ఆయనకు వరుసగా ఊరటలు దక్కుతుండడం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన్ని ఇంకో కేసులో ఇప్పుడు మరో పీఎస్‌కు తరలిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నరసరావుపేట పోలీసుల కస్టడీ పిటిషన్‌ను కోర్టు రద్దు చేసింది. దీంతో ఆగమేఘాల మీద విజయవాడ భవానీపురం పోలీసులు కర్నూల్ జైలుకు చేరుకున్నారు. ప్రిజనర్ ట్రాన్సిట్ వారెంట్ కింది పోసానిని హైదరాబాద్ మీదుగా విజయవాడకు తరలిస్తున్నారు. సాయంత్రంలోగా ఆయన్ని విజయవాడకు తీసుకొచ్చే అవకాశం ఉంది. కోర్టులో లేదంటే మెజిస్ట్రేట్ ఎదుట పోసానిని ప్రవేశపెట్టే అవకాశం ఉంది. రిమాండ్ విధిస్తే గనుక విజయవాడ జైలుకు పోసానిని తరలిస్తారు. లేదంటే మళ్లీ కర్నూలు జైలుకే తరలిస్తారు.



## ఇండియా టుడే సదస్సులో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గాల పునర్విభజన అంశంపై స్పందించారు. దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రాతినిధ్యం అంతంతమాత్రమేనని, ఇటీవలి ఎన్నికల్లో బీజేపీకి దక్షిణాదిన వచ్చింది 29 ఎంపీ స్థానాలేనని అన్నారు. దక్షిణాదిన ఒక్క రాష్ట్రంలోనూ బీజేపీకి అధికారం లేదని, ఏపీలో కేవలం జూనియర్ భాగస్వామిగానే ఉందని తెలిపారు. అందుకే బీజేపీ ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోందని... అందుకు డీలిమిటేషన్ అంశాన్ని వాడుకుంటోందని వివరించారు. డీలిమిటేషన్ అమలు జరిగితే ఉత్తరాది రాష్ట్రాలకే లబ్ధి చేకూరుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ఆదేశాలతోనే దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేశాయని అన్నారు. కేంద్రం మరో 30 ఏళ్ల పాటు డీలిమిటేషన్ ను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణ భారతదేశంలో జనాభా ఏ రీతిలో పెరుగుతుందో చూడాలన్నారు.




## మహిళల కోసం వర్క్ ఫ్రం హోం విధానాన్ని అమలు చేస్తాం

మహిళల భాగస్వామ్యం లేకుండా ప్రగతి అసాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో పురుషులతో సమానంగా మహిళల్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడం, రాష్ట్రాన్ని మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే మహిళా పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. విజయవాడలో మహిళా పారిశ్రామికవేత్తల సంఘం.. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా (ఎలీప్) ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సును సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. అనకాపల్లిలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటవుతున్న తొలి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇప్పుడు మహిళలు కూడా అపారమైన శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తూ సంపాదనలో పురుషులను మించిపోతున్నారని తెలిపారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023-24 ప్రకారం శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. అందుకే మహిళల కోసం వర్క్ ఫ్రం హోం (ఇంటి నుంచే పని) విధానాన్ని కూడా తీసుకువస్తున్నామని తెలిపారు. మహిళలు ఇంట్లో కూర్చునే మగవాళ్ల కంటే ఎక్కువ సంపాదించే పరిస్థితులను తీసుకువస్తామని తెలిపారు.



## కాలిఫోర్నియా గవర్నర్ రేసులో కమలాహారిస్..?

అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కాలిఫోర్నియా గవర్నర్ పదవికి పోటీపడుతున్నట్లు తెలిసింది. ఈ వేసవి చివరి వరకు దీనిపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కమలా హారిస్ దగ్గరి వ్యక్తులను ఊటంకిస్తూ అమెరికా మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. కాగా, గతేడాది నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ అధ్యక్షురాలి పదవికి పోటీ పడిన విషయం తెలిసిందే. డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన కమలా హారిస్.. ట్రంప్ చేతిలో ఓడిపోయారు.

## కోర్టు ట్రైలర్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని సమర్పణలో వాల్ పోస్టర్ బ్యానర్‌పై ప్రశాంతి నిర్మిస్తున్న లేటెస్ట్ మూవీ 'కోర్ట్. ఇందులో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. శివాజీ, సాయి కుమార్, రోహిణి, హర్షవర్దన్, శ్రీదేవి తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. యంగ్ డైరెక్టర్ రామ్ జగదీశ్ తెరకెక్కించిన ఈ మూవీ ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని ఉగాది కానుకగా మార్చి 14న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే.. తన కూతురితో ప్రేమలో ఉన్నాడనే కోపంతో ఓ తండ్రి (శివాజీ) ఆ కుర్రాడిపై కక్ష కట్టి కేసు పెడతాడు. అంతే కాకుండా అమ్మాయిలకు సంబంధించిన అన్ని సెక్షన్ల మీద అతడిపై కేసులు పెట్టడమే కాకుండా ఏకంగా పోక్సో కేసు కూడా బనాయిస్తాడు. ఇక బెయిల్ కూడా రాకపోవడంతో ఆ కుర్రాడు జైల్లో అలా 78 రోజులు మగ్గుతాడు. పోక్సో కేసు కావడంతో ఎవరూ వాదించడానికి ముందుకు రాడు. దీంతో ప్రియదర్శి ఆ కేసును వాదించడానికి వస్తాడు. మొత్తం కోర్ట్ ట్రైలర్ ఎంతో ఇంట్రెస్టింగ్‌గా సాగింది. ప్రజెంట్‌ఈ ట్రైలర్ నెట్టింట వైరల్ కావడంతో.. 'సొసైటీకి ఇప్పుడు ఇలాంటి చిత్రాలు చాలా అవసరం అని', 'ఈ సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది' అని కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.




## 'కోర్ట్' నచ్చకపోతే 'హిట్-3' చూడకండి – నాని

న్యాచురల్ స్టార్ నాని తన ప్రొడక్షన్ హౌజ్ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై తెరకెక్కిన మూవీ 'కోర్ట్' ప్రీ-రిలీజ్ ఈవెంట్ తాజాగా గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు పలువురు డైరెక్టర్స్‌తో పాటు హీరో నాని కూడా హాజరయ్యాడు. ఇక ఈ సినిమా ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి మంచి చిత్రాన్ని తప్పకుండా చూడాలని ఆయన కోరాడు. ఇక ఈ సినిమా తనకు నిర్మాతగా కాకుండా ఓ ప్రేక్షకుడిగా బాగా నచ్చిందని.. అందుకే ప్రేక్షకులను ఈ సినిమా చూడాల్సిందిగా కోరుతున్నట్లు ఆయన అన్నారు. ఒకవేళ 'కోర్ట్' చిత్రం ప్రేక్షకులకు నిజంగా నచ్చకపోతే తన నెక్స్ట్ మూవీ 'హిట్-3' చూడొద్దంటూ నాని కామెంట్ చేశాడు. దీంతో అందరూ ఈ సినిమాపై నానికి ఎంత కాన్ఫిడెంట్ ఉందో అర్థం అవుతుందని సోషల్ మీడియాలో కామెంట్ చేస్తున్నారు. కోర్ట్ చిత్రంలో ప్రియదర్శి, హర్ష్ రోషన్, శ్రీదేవి, శివాజీ, సాయి కుమార్, రోహిణి తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాను రామ్ జగదీష్ డైరెక్ట్ చేయగా విజయ్ బుల్గనిన్ సంగీతం అందించారు. మార్చి 14న కోర్ట్ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.






## మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డికి అస్వస్థత

మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. నిన్న గజ్వేల్ ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ మీటింగ్‌కు సబిత హాజరయ్యారు. సమావేశం అనంతరం సబిత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే సబితా ఇంద్రా రెడ్డిని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు ఆమెకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఫుడ్ పాయిజన్ వల్లే అస్వస్థకు గురైందని నిర్ధారించినట్లు సమాచారం. ఆపై సబితకు చికిత్స అందజేశారు. రాత్రి ప్రథమ చికిత్స అనంతరం కొద్దిసేపు అబ్జర్వేషన్‌లో ఉంచారు వైద్యులు. తరువాత అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆరోగ్యం కాస్త మెరుగవడంతో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# మహిళలు రాజకీయాలపట్ల అవగాహనా పెంచుకోవాలి

రాబోయే రోజుల్లో మహిళలు సమాజంలో, రాజకీయాల్లో అవగాహన పెంచుకుని రాణించాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ వ్యాఖ్యానించారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళను ఆదిపరాశక్తిగా పూజించేది ఒక్క భారతదేశ సంస్కృతిలోనే అని.. భారతదేశంలో పుట్టిన ప్రతీ మహిళా అందుకు గర్వపడాలని ఉద్ఘాటించారు. చట్టసభల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు చట్టం ఆమోదించామని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు.

## వచ్చే వారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు.. మంత్రి పొంగులేటి ప్రకటన!

ఇందిరమ్మ ఇళ్లపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వచ్చే వారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మరో వారంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమం చేపడతామని.. అర్హులైన వారిని ఎంపిక చేసి, పనులు మొదలు పెడతామని ప్రకటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అయితే.. గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరోలా మాట్లాడారు. సంక్రాంతి తర్వాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే 74% పూర్తయిందని తెలిపారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అక్టోబర్ పోయింది, డిసెంబర్ పోయింది, సంక్రాంతి పోయింది.. ఇప్పుడు సంక్రాంతి తర్వాత అంటున్నారని అప్పట్లోనే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ఇప్పుడు మరో వారం రోజుల్లోనే అంటూ ప్రకటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.





## లక్ష మంది మహిళలతో భారీ సభ.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శ్రీకారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. ఇందిరా మహిళా శక్తి మిషన్‌ను ఆవిష్కరించనున్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. లక్ష మంది మహిళలతో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది ప్రభుత్వం. అందులో భాగంగా.. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి మహిళా శక్తి మిషన్‌ను ఆవిష్కరించనున్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగే ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా పలు పథకాలను అమలు చేస్తోంది. కోటి మంది మహిళలను కోటీశ్వరులా చేసేలా ప్లాన్ చేసింది. ఇటీవల ఇందిరా మహిళా శక్తి మిషన్ కు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. సర్ప్, మెప్మాలకు విలీనం చేసి మహిళలకు లక్షల కోట్ల రూపాయల రుణం అందించడమే ఈ పథకం ఉద్దేశం. ఇకపై మహిళా సంఘాలన్నీ ఒకే వ్యవస్థ కింద పనిచేసేలా మహిళా శక్తి మిషన్ ను రూపొందించారు. మహిళా సంఘాలు విజయాలతో పాటు మహిళా ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025లో పొందుపరిచారు. పలు జిల్లాల నుంచి మహిళలు ఈ సభకు తరలివచ్చి తిరిగి వెళ్లేలా 600కు పైగా ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇవాళ్టి మండల మహిళా సమైఖ్య సంఘాల ఆధ్వర్యంలో నడిచే 150 ఆర్టీసీ అద్దె బస్సులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## 'బాపు' మూవీ ఓటీటీ రివ్యూ

బ్రహ్మాజీ మరియూ ఆమని ప్రధానమైన పాత్రలను పోషించిన 'బాపు' సినిమా, ఫిబ్రవరి 21వ తేదీన థియేటర్లకు వచ్చింది. రాజు – భానుప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాకి 'దయ' దర్శకత్వం వహించాడు. ఈ రోజు నుంచే ఈ సినిమా 'జియో హాట్ స్టార్' లో స్ట్రీమింగ్ అవుతోంది. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. మల్లన్న తండ్రి రాజయ్య (సుధాకర్ రెడ్డి) ఆ కుటుంబానికి పెద్ద తలకాయ. ఆయన ఇచ్చిన ఒక ఎకరం పొలమే మల్లన్నకు ఆధారం. ఊళ్లో అప్పుల కారణంగా మల్లన్న ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. అయితే అతని తండ్రి రాజయ్యను చంపేసి సహజ మరణంగా చూపించగలిగితే, సర్కారు వారి నుంచి 5 లక్షలు వస్తాయని మల్లన్నతో సరోజ చెబుతుంది. దాంతో అతను ఆలోచనలో పడతాడు. అదే ఊళ్లో లచ్చవ్వ (గంగవ్వ) కొడుకు చంటి (రచ్చరవి) జేసీబీ ఆపరేటర్ గా ఉంటాడు. అతను ఒకరోజున జేసీబీతో పనిచేస్తూ ఉండగా, పురాతన కాలం నాటి ఒక బంగారు విగ్రహం బయటపడుతుంది. ఆ బావిని పూడిక తీసినప్పుడు ఆ విగ్రహం రాజయ్యకి దొరుకుతుంది. అయితే మతిమరుపుతో బాధపడుతున్న రాజయ్య ఆ విగ్రహాన్ని ఎక్కడ దాచింది మరిచిపోతాడు. ఈ విషయం తెలియని మల్లన్న దంపతులు రాజయ్యను చంపాలని నిర్ణయించుకుంటారు. అందుకోసం వాళ్లు ఏం చేస్తారు ? ఆ ప్రయత్నం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది ? ఆ బంగారు విగ్రహం ఎవరి సొంతమవుతుంది ? వరలక్ష్మి వివాహం రవితో జరుగుతుందా ? అనేది కథ. దర్శకుడు ఈ కథను చెప్పడానికి ఎంచుకున్న విలేజ్ బాగుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన బ్రహ్మాజీ .. ఆమని .. సుధాకర్ రెడ్డి .. రచ్చ రవి అందరూ కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. వాసు పెండెం ఫొటోగ్రఫీ ఆకట్టుకుంటుంది. ఆహ్లాదకరమైన పల్లె అందాలను ఆవిష్కరించిన తీరు మెప్పిస్తుంది.





## డీలిమిటేషన్, త్రిభాషాకు వ్యతిరేకంగా డీఎంకే ఉద్యమం.. 12న నిరసనకు పిలుపు

తమిళనాడులో అధికార పార్టీ డీఎంకే_ _ _ కేంద్రంపై పోరాటానికి రెడీ అవుతోంది. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ, త్రిభాషా విధానంపై పోరాటం చేసేందుకు డీఎంకే స్పీడ్ పెంచింది. మార్చి 12న తమిళనాడు వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టినట్లు డీఎంకే ప్రకటించింది. తమిళనాడు కోసం డీఎంకే పోరాడుతుంది, కేంద్ర ప్రభుత్వంపై ప్రజా నిరసనలో విజయం సాధిస్తుందన్న నినాదంతో ర్యాలీ చేపట్టింది. అలాగే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ, త్రిభాషా విధానంపై ప్రజా చైతన్య సభ కూడా నిర్వహించనున్నారు.ఇదిలా ఉంటే డీఎంకేకు పోటీగా త్రిభాషా విధానానికి మద్దతు తెల్పుతు బీజేపీ కూడా పోరాటానికి సిద్ధపడింది. ఇప్పటికే కోటి సంతకాల సేకరణ చేపట్టింది. ఇదంతా ఎన్నికల స్టంట్స్ అంటూ టీవీకే పార్టీ తోసిపుచ్చింది. ఈ పోరాటానికి దూరంగా ఉండాలని విజయ్‌కు చెందిన టీవీకే నిర్ణయం తీసుకుంది.

## ట్రంప్ ముందే వాగ్వాదానికి దిగిన మస్క్, రుబియో!

అమెరికాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్వహించిన కేబినెట్ మీటింగ్‌లో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రుబియో మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. అధ్యక్షుడు ట్రంప్ ముందే ఇద్దరూ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఇద్దరి నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగినట్లు అమెరికా మీడియా పేర్కొంది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ట్రంప్.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ శాఖను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ శాఖ బాధ్యతలను టెస్లా బాస్ ఎలాన్ మస్క్‌కు అప్పగించారు. మెరుగైన పాలన, ప్రభుత్వంలో వృథా ఖర్చుల్ని తగ్గించేందుకు డోజ్ శాఖ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులను తొలగిస్తోంది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అప్రమత్తమైన ట్రంప్.. కేబినెట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌కు మస్క్‌తోపాటు విదేశాంగ మంత్రి మార్కో రుబియో కూడా హాజరయ్యారు. ఆ సమయంలో మస్క్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో పనిచేయని ఉద్యోగులను తొలగిస్తున్నట్లు చెప్పారు. అయితే, రుబియో మాత్రం ఎవరినీ ఉద్యోగాల నుంచి



తొలగించలేదని వ్యాఖ్యానించారు. మస్క్ మాటలకు రుబియో సహనం కోల్పోయారు. ఇప్పటికే 1,500 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేసినట్లు చెప్పారు. తాను ఉద్యోగులను తొలగించాలంటే పదవీ విరమణ చేసిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాల్సి ఉంటుందంటూ సమాధానమిచ్చారు. అయితే, మస్క్ — రుబియో మధ్య వాగ్వాదం వార్తలపై ట్రంప్ స్పందించారు. ఆ వార్తలను కొట్టిపారేశారు. తాను అక్కడే ఉన్నానని.. మీటింగ్ ఘర్షణ వంటిది ఏమీ జరగలేదని స్పష్టం చేశారు.

## శుభ్‌మన్ గిల్‌కు ప్రమోషన్

భారత క్రికెట్ బోర్డు(బీసీసీఐ) 2025-26 ఏడాదికి గాను ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను ప్రకటించేందుకు సిద్ధమైంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ముగిసిన తర్వాత ఈ లిస్ట్‌ను రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. గతేడాది సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్ దక్కనున్నట్లు సమాచారం. అతని సెంట్రల్ కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దేశీవాళీ క్రికెట్‌లో ఆడాలన్న తమ ఆదేశాలను ధిక్కరించడంతో బీసీసీఐ అయ్యర్‌పై వేటు వేసింది. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకుని రంజీల్లో ఆడిన శ్రేయస్ తిరిగి జాతీయ జట్టులోకి వచ్చాడు. జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన అయ్యర్.. తన అద్భుతప్రదర్శనతో అందరిని ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలోనూ శ్రేయస్ దుమ్మురేపుతున్నాడు. ఈ క్రమంలోనే అతడికి తిరిగి మళ్లీ కాంట్రాక్ట్ ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించుకుంది.

గిల్‌కు ప్రమోషన్.. కోహ్లి, రోహిత్‌కు డిమోషన్

మరోవైపు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సైతం ప్రమోషన్ ఇవ్వాలని బీసీసీఐ భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గిల్ ప్రస్తుతం బీసీసీఐ వార్షిక కాంట్రాక్ట్‌ల్లో ఏ కేటగిరిలో ఉన్నాడు. ఇప్పుడు అతడిని టాప్ గ్రేడ్(ఏ ప్లస్)కు ప్రమోట్ చేయాలని బీసీసీఐ పెద్దలు నిర్ణయించుకున్నారంట. కాగా ప్రస్తుతం ఏ ప్లస్ కేటగిరిలో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రాలు మాత్రమే ఉన్నారు. అయితే అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన కోహ్లి, రోహిత్ శర్మ, జడేజా కాంట్రాక్‌లు మారనున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఈ సీనియర్ త్రయాన్ని ఏ ప్లస్ నుంచి ఏ గ్రేడ్‌కు డిమోట్ చేసే అవకాశముంది. వీరిస్థానాల్లో గిల్‌తో పాటు వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఏ ప్లస్




కేటగిరిలో చోటు దక్కే సూచనలు కన్పిస్తున్నాయి.

కేటగిరి వారీగా ఆటగాళ్లకు దక్కే మొత్తం ఎంతంటే ?

ఏ ప్లస్ కేటగిరిలో ఉన్న ఆటగాళ్లకు వార్షిక వేతనం కింద యేటా రూ. 7 కోట్లు దక్కనున్నాయి. 'ఏ' కేటగిరీలోని క్రికెటర్లకు రూ. 5 కోట్లు..'బి' కేటగిరిలో ఉన్న వారికి రూ. 3 కోట్లు.. 'సి' కేటగిరిలో ఉన్న క్రికెటర్లకు కోటి రూపాయల వార్షిక వేతనం లభించనుంది.

## భారత తొలి ఫైటర్ పైలట్లు వీరే

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారనే విషయం అందరికీ తెలిసిందే. ఈ ఏడాది ఉమెన్స్ డే సందర్భంగా "మహిళలు, అమ్మాయిలందరికీ హక్కులు, సమానత్వం, సాధికారత" అనే థీమ్‌ను ఎంచుకున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన రోజున గతంలో వాళ్లు సాధించిన విషయాలను ఒకసారి స్మరించుకుంటే.. మహిళలంటే ఏంటో మరోసారి పురుషులకు బోధపడుతుంది. అలాగే మహిళలకు గతంలో తాము ఏం సాధించామో కూడా ఒకసారి తెలుస్తుంది. అందుకే భారత దేశానికి రక్షణగా నిలుస్తూ.. దేశాన్ని రక్షించే ఆడ సింహాల్లా.. భారత వైమానిక దళంలో చేరిన మొట్టమొదటి ముగ్గురు మహిళా ఫైటర్ పైలట్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. గతేడాది అవని చతుర్వేది, భావన కాంత్, మోహ నా సింగ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ పైలట్ శిక్షణ పొందిన మొదటి మహిళలుగా చరిత్ర సృష్టించారు. భారత సాయుధ దళాలలో మహిళల ప్రాతినిధ్యం పెంచడంలో అవని చతుర్వేది, భావనా కాంత్, మోహనా సింగ్‌లు విప్లవాత్మకమైన ముందడుగు వేశారని చెప్పవచ్చు. స్క్వాడ్రన్ లీడర్ మోహనా సింగ్ భారతదేశంలోని స్వదేశీ



'మేడ్ ఇన్ ఇండియా' LCA తేజస్ ఫైటర్ జెట్ స్క్వాడ్రన్‌ను నిర్వహిస్తున్న ఎలైట్ 18 'ఫ్లయింగ్ బుల్లెట్స్' స్క్వాడ్రన్‌లో చేరిన మొదటి మహిళా ఫైటర్ పైలట్ అయ్యారు. స్క్వాడ్రన్ లీడర్లు భావనా కాంత్, అవని చతుర్వేది ప్రస్తుతం Su-30 MKI ఫైటర్ జెట్‌లను నడుపుతున్నారు. 2016లో, అవని చతుర్వేది, భావన కాంత్‌లతో కలిసి మోహనా సింగ్, భారత వైమానిక దళం ఫైటర్ పైలట్ ప్రోగ్రామ్‌లోకి ప్రవేశించిన మొదటి మహిళలు. వీరి ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి.

## చెస్ స్టార్ టు స్పేస్ సైంటిస్ట్.. మోదీ ఎక్స్ అకౌంట్‌లో వుమెన్ అచీవర్స్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ అకౌంట్‌ను మహిళలు ఆపరేట్ చేస్తున్నారు. వుమెన్ అచీవర్స్ ఆ అకౌంట్‌లో పోస్టు చేస్తున్నారు. ఇండియన్ చెస్ గ్రాండ్‌మాస్టర్ ఆర్ వైశాలి, సైంటిస్టులు ఎలీనా మిశ్రా, శిల్పీ సోనీలు .. ప్రధాని మోదీ అకౌంట్ నుంచి ట్వీట్స్ చేశారు. ప్రధాని ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేయడం థ్రిల్‌గా ఉందని ఆ వుమెన్ అచీవర్స్ పేర్కొన్నారు. వనక్కం.. నేను వైశాలి.. ప్రధాని మోదీ సోషల్ మీడియా అకౌంట్‌ను ఆపరేట్ చేస్తున్నట్లు చెస్ క్రీడాకారిణి తెలిపారు. దేశం తరపున ఎన్నో టోర్నీలు ఆడానని, దాని పట్ల గర్వంగా ఉందన్నారు. ఆరేళ్ల ప్రాయం నుంచి చెస్ ఆడుతున్నట్లు చెప్పింది. లెర్నింగ్, థ్రిల్లింగ్, రివార్డింగ్ జర్నీలా ఉందని పేర్కొన్నది. యువ అమ్మాయిలకు ఆమె సందేశం ఇచ్చారు. ఎన్ని అవరోధాలు వచ్చినా.. కలలను వీడవద్దు అన్నారు.

